# మమతల కోవెల

**- ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి**

రాజు గుండె జబ్బుతో సడన్‌గా చనిపోయాడు. భార్య సరిత గొల్లుమంది. సాయంత్రం వరకు మాట్లాడిన వాడు హార్ట్ ఎటాక్ వచ్చి ఆస్పత్రిలో చేర్చే సమయం కూడా లేకుండానే చనిపోయాడు. సరిత, రాజులది చాలా అన్యోన్య దాంపత్యం. ఒకరిని విడిచి ఒకరు ఎప్పుడూ ఒక్క రోజు కూడా ఉండలేదు పెళ్లయిన తరువాత. అట్లాంటిది భార్యాబిడ్డల్ని వదిలి పూర్తిగా వెళ్లిపోయాడు. తల్లి, తండ్రి, అన్నలు, వదినలు చాలా బెంగ పెట్టుకున్నారు. సరిత ఎలా తట్టుకుంటుందా అని. పుట్టిల్లు ఊర్లోనే అయినా ఎప్పుడూ నాలుగు రోజులు ఉండలేదు. పదో రోజు అయితే స్పృహలోనే లేదు. వచ్చిన వారికి నచ్చచెప్పి ఫార్మాలిటీస్ కూడా ఏమీ చేయకుండా వదిలేశారు.

సరిత బి.ఏ. పాసయింది. భర్త, ఇల్లే స్వర్గంగా భావించి ఉద్యోగం వచ్చినా చెయ్యకుండా ఇల్లు, పిల్లల కోసమే తన సమయమంతా వెచ్చించింది. ఒక్క జీతంతో పొదుపుగా ప్రవర్తించి ఇంట్లోకి కావలసినవన్నీ అమర్చుకుంది. వాళ్ల సంసారం చుట్టాలందరికి ఆనందం. ఆదర్శం. రాజు మరణం పిడుగుపాటయింది అందరికి. ఇక సరితకి చెప్పక్కరలేదు.

సరితకి ఇద్దరు అక్కలు, వదినలు. ఒక్కతే చెల్లెలు సరిత. అందరికీ అణుకువగల సరిత అంటే ఎంతో ఇష్టం. సరిత స్థితి చూసి, ఆమెకి పట్టినగతికి, ముఖ్యంగా ఆమె పరిస్థితికి అందరూ ఎంతో బాధపడ్డారు.

భర్తపోయి నాలుగు నెలలయింది. సరిత ఏమాత్రం కోలుకోలేదు. పిల్లలను పట్టించుకోవటం లేదు. తన మీద శ్రద్ధ అసలే పోయింది. తిండి తినదు. భర్త కంపెనీ వారు ఉద్యోగం ఇస్తామన్నా వద్దంది. నెలలు గడిచినా సరితలో మార్పేమీ లేదు. రెండుసార్లు ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేసింది. పిల్లలను కూడా దగ్గరకు తీసేదికాదు. తిండీ నిద్రాలేకుండా అస్తమాను ఏడుస్తూ పడుకునేది. ఇదేతీరులో ఉంటే పిచ్చెక్కే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరించారు. అన్నలు, తల్లిదండ్రులు ఎంతప్రయత్నించినా సరిత పద్ధతిలో మార్పు రాలేదు.

''అమ్మా! అత్తకి పని ఉందిట. అన్నం పెట్టవే'' అంటూ వచ్చాడు బాబు. సరిత శూన్యంగా చూసింది. నాలుగుసార్లు అడిగి ప్రయోజనం లేక వెళ్లిపోయాడు బాబు.

''వెధవ సంత నాకు తప్పదు'' చిన్న వదిన సణుగుడు చిన్నగా వినబడింది.

''అమ్మా పెద్ద అత్త కొట్టిందే'' అంటూ వచ్చింది రమణి.

''ఎందుకు'' అంది మొదటిసారిగా భర్త పోయాక మాట్లాడుతూ సరిత. ''రాణి చేతిలో బొమ్మ తీసికున్నానని కొట్టిందే. అమ్మా నాకూ కొనిపెట్టవా. నాన్న ఎప్పుడూ కొనేవారుగా'' ఏడుపు మొదలెట్టింది రమణి. రమణిని కావలించుకుని భోరున ఏడ్చింది సరిత. సరిత ఏడుపు చూసి తన ఏడుపు మరచిపోయింది రమణి.

''అమ్మా నాకు పుస్తకాలు కొనలేదే మామయ్య. చంద్రికని, నన్నూ కలిసి చదువుకోమంటున్నాడు. చంద్రికేమో నేనెప్పుడు అడిగినా నేనే చదువుకోవాలి అంటుంది. రేపేమో పరీక్ష. టీచరు కొడుతూంది సరిగా వ్రాయకపోతే'' ఏడుపు మొహం పెట్టాడు రవి.

''చంద్రికా బావకి కూడా కొంచెం సేపు ఇయ్యమ్మా'' అంది సరిత. భర్తపోయిన అన్ని రోజులకి గదిదాటి బయటికి వచ్చింది.

''నాకు మాత్రం పరీక్ష లేదేమిటి? నాన్నగారు కొన్నదేమొన్న. రెండు రోజులైనా చదువుకోకపోతే ఎలా?'' అంది. చేతిలో పుస్తకం ఉందికాని టి.వి. మీదే దృష్టి ఎక్కువగా ఉంది.

''పోనీ అన్నయ్యా వాడికింకో పుస్తకం కొంటే'' అంది మెల్లగా.

''అందరికీ ఎన్నని కొనను నేను మాత్రం. ఉన్నవే అందరూ సర్దుకోవాలి గాని'' అన్నాడు పెద్దన్న చిరాగ్గా.

''కొంచెం సర్దుకోరాదు చంద్రికా?'' అంది మళ్లీ చంద్రికకే నచ్చచెప్పుతున్నట్లు.

''సర్దుకుంటూనే ఉన్నారుగా వదినా. అందరినీ చదివించటం కష్టమని, కాన్వెంట్ చదివే వాళ్లని తెచ్చి మామూలు స్కూల్లో పడేశారు. ఇక్కడ పాఠాలు సరిగా చెప్పరట. వాళ్లే చదువుకునేటప్పుడు ఆమాత్రం టైము పట్టదా?'' అంది చిన్నావిడ. ఉత్తప్పుడు తోటి కోడళ్లకి పడనే పడదు అంతగా. ఇప్పుడు బావగారి కూతురిని వెనకేసుకొస్తూంది.

ఏం మాట్లాడలేక లోపలికి వచ్చేసింది సరిత.

''అమ్మా. ఎలాగేమరి'' ఏడుపుమొహంతో వెన్నంటి వచ్చాడు.

''ఎలాగంటే ఫెయిలవరా నీ కర్మ'' అంటూ తనూ ఏడ్చింది సరిత.

తండ్రి దగ్గరకు వెళ్లింది కళ్లు తుడుచుకుని సరిత. ''నాన్నా విన్నారుగా. నువ్వైనా కొనునాన్నా పుస్తకాలు. వాడు భోజనం మానేసి పడుకున్నాడు.'' అంది.

''నన్ను మాత్రం ఏం చెయ్యమంటావు తల్లీ. నేనిచ్చే పెన్షన్ మా తిండికే సరిపోదు. నా దగ్గర ఏమీ పెట్టుకోను తెలుసుగా'' అన్నాడు తండ్రి.

తెలుగులో పాఠాలు అర్థం కావటం లేదని, యూనిఫాం కొనటానికి లేటు చేస్తున్నారని, అదని ఇదని పిల్లలు రోజూ గొడవ చేస్తున్నారు. తల్లితో చెప్పింది సరిత. ''వాళ్ళు మాత్రం ఎంతని చూస్తారు. పాపం, ఇంకా నా కొడుకులు ఉత్తములమ్మా'' తల్లి ఎవరితోనో అంటోంది.

''ఈ రోజుల్లో వదినలు, ఆడబడుచుని పిల్లలని పెట్టుకోవటం గొప్పే''. వచ్చినావిడ వంతపాడుతూ అంది.

''ఏం కష్టాలొచ్చినా నీ చావునీదే అని వదిలేస్తున్నారు ఈరోజుల్లో''

''ఏం గొప్పో ఏమో. ఇంతమందిని పెంచి పెద్దచేసి, పెళ్లిళ్లూ చేసేటప్పటికి మాకు మిగిలేది చిప్పే'' నోరు విప్పని పెద్దవదిన జోకులాగా అంటోంది.

మర్నాడు చిన్నన్న దగ్గర కెళ్లి నిలబడిన సరితని చూసి చూడనట్లు ''ఏమిటి?'' అన్నాడు ముభావంగా.

నిట్టూర్చింది సరిత. ''బంగారూ'' అంటూ ప్రేమగా పిలిచే చిన్నన్న.

''అన్నయ్యా, వారి ఉద్యోగం నాకిస్తారన్నావుగా. కొంచెం కనుక్కుంటావా?'' అంది మెల్లిగా.





''పోనీలేవమ్మా. ఉద్యోగం చెయ్యటం ఇష్టం లేదన్నావుగా. ఊరుకో'' అన్నాడు ప్రేమగా.

''వర్ధన్నయ్యా ఎంతకాలం ఒకరికి బరువు ముగ్గురు పిల్లలతోటి. ఆ సంగతి చూడు'' అంటూ లోపలికెళ్ళిపోయింది. ఉద్యోగం చేస్తాననగానే అతని కంఠంలో వచ్చిన ఆప్యాయత గమనించింది సరిత.

''అమ్మా. మనస్లానే ఫలించింది. అది మనుషుల్లో పడింది'' అన్నాడు. ఆ రాత్రి పెద్దన్నయ్యా, చిన్నన్న రాఘువ, సరిత ఉద్యోగం చేస్తానని చెప్పిందనగానే.

''కానీ మేమిద్దరమే చెడ్డవాళ్లం అయ్యాము'' అంది బాధగా పెద్దవదిన. ''అవునక్కా'' అంది చిన్నకోడలు.

''పోనీ లెండర్రా! ఎవరం చెడు అయినా దాన్ని మనుషుల్లో పడెయ్యటానికేగా. లేకపోతే దానికి కూడా మతిచెలిస్తే పిల్లలు అన్యాయమయ్యేవారు'' అంది తల్లి.

''అయినా మీ మనస్సులు మాకు తెలుసుగా'' అంది.

''మరే! ఎవరూ బాధపడకండి. కొన్నాళ్ల పోయాక మనం ఆడిన నాటకం సరితకి చెప్పచ్చులెండి'' అన్నాడు తండ్రి సీతారామయ్య.

'ఎవరూ చెప్పక్కరలేదు నాన్నా! ఇంతమంది మంచి మనుషులు నాకు అండగా ఉన్నారనే దేముడు వారిని తీసికెళ్లిపోయాడేమో' మంచినీళ్లకు లేచిన సరిత కన్నీళ్లు కారుతుండగా అనుకుంది.

★